సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 2 । జులై । 2023



చీనీ టన్ను రూ.23వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23వేలు పలికాయి. మార్కెట్‌కు 898 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



సందడిగా ఏకాదశి
ఏకాదశి సందర్భంగా పుట్టపర్తి మండలం కొత్తనిడిమామిడి, కప్పలబండ గ్రామాల్లో శనివారం ఉట్ల పరుష, ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. 8లో

గరిష్టం/కనిష్టం 35.9°/23.2°
శనివారం జిల్లాలో ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయాయ్యి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. గంటకు 8 నుంచి 10 కి.మీ వేగంతో గాలి వీచింది.

'జగనన్న సురక్ష'.. జనరక్ష

- పేదలకు మేలుచేస్తున్న పథకం
- తొలి రోజు జిల్లా వ్యాప్తంగా క్యాంపులు
- పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్
- ఎక్కడికక్కడ లబ్ధిదారులకు సర్టిఫికెట్ల అందజేత
- వ్యయ ప్రయాసలు తప్పాయని జనం ఆనందం

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు, సేవలు ముంగిళ్లలోనే అందించేందుకు జగన్ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం జనానికి వరంలా మారింది. తొలిరోజు శనివారం జిల్లాలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం విజయవంతమైంది. శిబిరాల్లో ఎమ్మెల్యేలు మాలగుండ్ల శంకరనారాయణ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు. వివిధ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. దరఖాస్తు చేసిన వెంటనే ఎవరి సిఫారసు లేకుండా ఉచితంగా సర్టిఫికెట్ అందడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

తొలిరోజే 5,443 సర్టిఫికెట్ల అందజేత..

జిల్లాలో గత నెల 24వ తేదీన 'జగనన్న సురక్ష' సర్వే ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవసరమైన పత్రాలు కోసం దరఖాస్తులు స్వీకరించారు. అందుకు సంబంధించిన టోకెన్లు అందజేశారు. అనంతరం దరఖాస్తులను సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అధికారులు మంజూరు చేసిన పత్రాలను తొలిరోజు జరిగిన సురక్ష శిబిరాల్లో అందజేశారు. వివిధ ధ్రువీకరణపత్రాల కోసం జిల్లాలో 16,289 దరఖాస్తులు అందగా, తొలిరోజే 5443 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఇంకా 10,839 దరఖాస్తులకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలు ఇస్తే వెంటనే ఆయా సేవా సర్టిఫికెట్లు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం జులై 30 వరకూ కొనసాగుతుందని లబ్ధిదారులకు అందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. రెండో విడతలో భాగంగా శనివారం మరో 27 సచివాలయాల్లో ఇంటింటి సర్వే ప్రారంభించారు.



గోరంట్ల: వానవోలులో ఓ మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జేసీ చేతన్ తదితరులు



మడకశిర మండలం మణూరులో ఓ వ్యక్తికి కులధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ కార్తీక్

జిల్లాలో 'సురక్ష' సభలు ఇలా...

- మడకశిర నియోజక వర్గంలోని రొళ్ల -1 సచివాలయంలో కలెక్టర్ అరుణ్‌బాబు అధ్యక్షతన సురక్ష శిబిరం నిర్వహించి సేవా సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరీలతో కలిసి ప్రసంగించారు. కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- పెనుకొండ నియోజక వర్గంలోని గోరంట్ల మండలం వానవోలు-1 సచివాలయంలో నిర్వహించిన సురక్ష గ్రామ సభలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జాయింట్ కలెక్టర్ చేతన్ పాల్గొన్నారు. 'జగనన్న సురక్ష' ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.
- పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓడీ చెరువు 1వ సచివాలయంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సురక్ష క్యాంపును నిర్వహించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.
- రాప్తాడు నియోజకవర్గం సీకేపల్లి మండలం కనుముక్కలలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 రకాల సేవా సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. దీంతో ప్రజలు ఆయనకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.
- కదిరి నియోజకవర్గం నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామ సచివాలయంలో సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి హాజరై ప్రసంగించారు. అనంతరం సేవా సర్టిఫికెట్లు అందజేశారు.
- ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రిలో డీసీఎంఎస్ చైర్మన్ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో సురక్ష గ్రామ సభ నిర్వహించారు. అక్కడికక్కడే లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.



ఓడీసీలో ఓ లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



గాండ్లపెంట మండలం గొడ్డువెలగలలో లబ్ధిదారురాలికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



సీకేపల్లి మండలం కనుముక్కలలో ఓ మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, చిత్రం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

'సురక్ష'తో అర్హులందరికీ న్యాయం



రొళ్ల: లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

మడకశిర రూరల్/రొళ్ల/రొద్దం: జగనన్న సురక్షతో అర్హులందరికీ న్యాయం చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. శనివారం ఆయన మడకశిర మండలం మణూరు, రొళ్ల-1, రొద్దం మండలంలోని దొడగట్ట గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ సభల్లో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇప్పటికే అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. ఎక్కడైనా ఒకరో ఇద్దరో పథకాలు అందుకోలేకపోతే 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో వారిని గుర్తించి పథకాలు అందేలా చూస్తామన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్య ఉంటే 'జగనన్న చెబుదాం' టోల్‌ఫ్రీ నంబర్ 1902కు ఫోన్ చేసి సమస్య తెలుపవచ్చన్నారు. అదే విధంగా జనన, మరణ, ఆదాయ, కుల తదితర 11 రకాల సర్టిఫికెట్లను పైసా ఖర్చు లేకుండా ఉచితంగా అందిస్తామన్నారు. జిల్లాలో నెలరోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. గ్రామ సభల అనంతరం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు.

వైద్యులను అందుబాటులో ఉంచండి

రొళ్లలో సచివాలయం-1 సందర్శన అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు ఈ-సర్వీసెస్‌పై ఆరా తీశారు. రేషన్ కార్డులో చిన్న పిల్లల పేర్లు నమోదు కావడం లేదని, స్థానిక సీహెచ్‌సీలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లతో పాటు డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్లు మధులత, భవానిశంకరి, పెనుకొండ డీఎల్‌డీఓ శివారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా సర్టిఫికెట్ అందింది



వలంటీర్ ద్వారా ఎన్నో సేవలను అందిస్తున్న ప్రభుత్వం .. రూపాయి కూడా ఖర్చు లేకుండానే నాకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అందజేసింది. తెల్లవారుజామునే పింఛన్ అందించే వలంటీర్ ఇలాంటి పనులు సైతం చేయడం చాలా సంతోషంగా ఉంది. ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ రుణాన్ని త్వరలోనే తీర్చుకుంటాం.
– లీలావతమ్మ, నిడిమామిడి

చిటికెలో పని జరిగింది



నా ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం చేయించుకునేందుకు గతంలో పలుమార్లు బ్యాంకుల చుట్టూ తిరిగాను. కానీ ఫలితం లేకపోయింది. దీంతో సంక్షేమ పథకాలు అందక ఇబ్బంది పడ్డాను. 'జగనన్న సురక్ష' కార్యక్రమం సర్వేలో భాగంగా అధికారులు, వలంటీర్ మా ఇంటికి వచ్చినప్పుడు ఆధార్‌కు నా సెల్ నంబర్‌కు అనుసంధానం చేయమని అడిగాను. వారు వెంటనే చేసి ఇచ్చారు.
– చంద్రశేఖర్‌రెడ్డి, కత్తివారిపల్లి

పైసా ఖర్చులేదు



'జగనన్న సురక్ష' కార్యక్రమంలో పైసా ఖర్చు లేకుండా నాకు జనన ధ్రువీకరణ పత్రం అందింది. గతంలో సర్టిఫికెట్ పొందాలంటే రెండు, మూడు రోజులు మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే సేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయి.
– గీతాబాయి, మణూరు గ్రామం.

2.24 లక్షల మందికి పింఛన్



వెంగళమ్మచెరువులో ఓ వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సోమశేఖర్

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లా పండువలా సాగింది. జిల్లాలో 2,62,022 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, వీరికోసం ప్రభుత్వం రూ.72,76,04,500 విడుదల చేసింది. శుక్రవారం సాయంత్రమే బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసి ఉంచుకున్న వలంటీర్లు శనివారం తెల్లవారుజాము నుంచే ఇంటింటికీ తిరిగి పింఛన్ పంపిణీ చేశారు. ఫలితంగా తొలిరోజే జిల్లాలో పింఛన్ పంపిణీ 87 శాతం పూర్తయ్యింది. సచివాలయ సిబ్బంది వలంటీర్ల సహకారంతో 2,29,070 మందికి రూ.63,57,57,250 పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. పింఛన్ పంపిణీకి మరో నాలుగు రోజులు గడువు ఉందని, తప్పకుండా వంద శాతం పూర్తి చేస్తామన్నారు. ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీర్లు తలుపుతట్టి పింఛన్ డబ్బు చేతికి అందించడంతో లబ్ధిదారుల మోముల్లో ఆనందం వికసించింది.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- డ్రైవర్ దుర్మరణం

కదిరి టౌన్: ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. కుటాగుళ్ల సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల మలుపు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ మధు తెలిపిన మేరకు.. కదిరి నుంచి శనివారం సాయంత్రం ఆర్టీసీ అల్ట్రా బస్సు పులివెందుల బయలుదేరింది. కుటాగుళ్ల సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల మలుపు వద్ద కుంట్లపల్లి నుంచి కదిరికి వస్తున్న పాల ఆటోను ఢీకొంది. తీవ్రగాయాలైన ఆటో డ్రైవర్ కార్తీక్(22) అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

సాహస అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు తెలిపారు. 2020, 2021, 2022 సంవత్సరాలలో భూమి, నీరు, గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో విజయాలు సాధించిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాహస క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించే వ్యక్తులకు జీవిత కాల సాఫల్యం కింద అవార్డుతో పాటు రూ.1.50 లక్షల నగదును రాష్ట్రపతి చేతుల మీదుగా అందిస్తారన్నారు. వచ్చేనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు https://awards.gov.in ను సంప్రదించాలని సూచించారు.

చేనేతల సంక్షేమమే ధ్యేయం

- ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



లబ్ధిదారులకు మగ్గం పరికరాలు అందజేస్తున్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: టీడీపీ హయాంలో నిర్వీర్యమైన చేనేత రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ప్రతి చేనేత కార్మికుడూ ఆర్థికంగా బలపడేందుకు 'నేతన్న నేస్తం'తో ఆర్థిక సాయం, 'ముద్ర' రుణాలు, సబ్సిడీ పరికరాలు అందజేస్తున్నారన్నారు. శనివారం దీనజనోద్ధరణ భవనంలో జాతీయ చేనేత అభివృద్ధి మండలి పథకం కింద అర్హులైన 115 మందికి చేనేతలకు 90 శాతం సబ్సిడీతో పరికరాలు అందజేశారు. అర్హత ఉండి పరికరాలు అందని వారు దరఖాస్తు చేసుకుంటే రెండో విడతలో అందజేస్తామన్నారు. అనంతరం చేనేత జౌళి శాఖ ఏడీ రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసి సమావేశంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ మాధవ్ మాట్లాడుతూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన రోజు నుంచీ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అందువల్లే జనమంతా జగన్‌వెంటే నడుస్తున్నారన్నారు. దీన్ని ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు బస్సుయాత్రలు, పాదయాత్రలు చేస్తూ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. విజ్ఞతగల ప్రజలు అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, టీడీపీ హయాంలో చేనేత రంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. ప్రతిపక్షనేతగా చేనేతల జీవితాలను కళ్లారా చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే 'నేతన్న నేస్తం' పేరుతో ఏటా రూ.24 వేలు అందజేస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ఇప్పటికే నాలుగు విడతల నేతన్న నేస్తం నిధులు అందజేశారని, త్వరలోనే ఐదో విడత అందజేస్తారన్నారు. నేతన్నను అన్ని విధాలా ఆదుకొంటున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అందరం అండగా నిలవాలని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డితో పాటు చేనేత కార్మికులు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం


మృతుడు గోవిందప్ప

పావగడ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణగిరి గ్రామ సమీపంలో జరిగింది. వీర్లగొంది గ్రామానికి చెందిన గోవిందప్ప (33) ద్విచక్ర వాహనంలో గ్రామం నుంచి కృష్ణగిరి వైపు వెళ్తుండగా సమీపంలోని గేటు వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీ కొంది. దీంతో గోవిందప్ప తలకు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య రూప, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సందడిగా ఏకాదశి

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం కొత్తనిడిమామిడి, కప్పలబండ గ్రామాల్లో శనివారం ఏకాదశి సందడి నెలకొంది. పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన ఉట్ల పరుష, ఎడ్ల బండ్ల పరుగు పోటీలకు జనం పోటెత్తారు. నిడిమామిడిలో ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో పెనుకొండ, కొట్లపల్లి, పెదపల్లి, రాచువారిపల్లి, బుగ్గపల్లి, గాజులపల్లి తదితర 15 గ్రామాల నుంచి 80కి పైగా బండ్లు పాల్గొన్నాయి. కొత్తనిడిమామిడిలోని వీరభద్ర స్వామి ఆలయం పక్కన నిర్వహించిన ఉట్ల మాను ఉత్సవంలో ఉట్టి కొట్టేందుకు యువత పోటీపడ్డారు.

- కొత్తచెరువు మండలం బైరాపురంలోనూ ఏకాదశి వేడుకలు కనులపండువగా సాగాయి. కొత్తచెరువు-శెట్టిపల్లి ప్రధాన రోడ్డుపై ఎడ్లబండ్లు పరుగు పందేలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక శివాలయం వద్ద ఉట్లోత్సవంలో యువత కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు.


నిడిమామిడిలో ఉట్లోత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు


బైరాపురంలో ఉట్టి కొట్టేందుకు ఎగబడుతున్న యువకులు


ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో స్థానికుల కోలాహలం

నిడుగల్ దుర్గంపై దొంగలు పడ్డారు


ఆలయం తలుపులు పగులగొట్టిన దృశ్యం

పావగడ: స్థానిక చరితాత్మక నిడుగల్ దుర్గంపై శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. నాలుగు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. పురాతన వీరభద్ర స్వామి ఆలయంలో హుండీ పగుల కొట్టి కానుకలు తస్కరించారు. సమీపంలోని జైన బసదిలోనూ హుండీ ధ్వంసం చేసి నగదు అపహరించారు. లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం తలపులు పగుల గొట్టి లాకర్, హుండీని తెరిచేందుకు విఫల యత్నం చేశారు. తమను గుర్తు పట్టకుండా ఆయా చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఫుటేజీలను పట్టుకెళ్లారు. చోరీ ఘటనలపై శనివారం అరసికెర పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ప్రాచీన ఆలయాలకు భద్రత కల్పించి దొంగతనాలను అరికట్టాలని స్థానిక వాల్మీకి ఆశ్రమ అధిపతి సంజయ కుమార స్వామి పోలీసులను కోరారు.

సమాజ సేవతో సంతృప్తి

- సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు


సత్యసాయి అమృత కలశాల కిట్లను అందుకున్న గ్రామస్తులతో రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: సమాజ సేవ చేయడంతో ఆత్మసంతృప్తి లభిస్తుందని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు పేర్కొన్నారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా జోన్-1 సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన సత్యసాయి భక్తులు శనివారం నల్లమాడ మండల పరిధిలోని అరవవాండ్ల తాండా, పెమనకుంట పల్లి తాండాలలో గ్రామ సేవ నిర్వహించారు. 230 కుటుంబాలకు నూతన వస్త్రాలు, ఆహార పదార్థాలు ఉన్న సత్యసాయి అమృత కలశాలను ఆర్‌జే రత్నాకర్ రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా మార్గం చూపారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా భావం పెంపొందించుకోవాలని సూచించారు. అభాగ్యులకు సేవ చేసి ఔన్నత్యాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పట్టుబడింది ఆ సొమ్మే..!

చిలమత్తూరు: మండల పరిధిలోని కొడికొండ చెక్ పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం భారీఎత్తున నగదు పట్టుబడిన విషయం తెలిసిందే. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో 44వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు బెంగళూరు వైపు నుంచి వస్తున్న స్కార్పియో వాహనంలో రూ.1,15,48,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. పాత నోట్లను కొందరు కొత్త కరెన్సీగా మార్చుకుని తీసుకొస్తున్న క్రమంలోనే పట్టుబడ్డాయనే గుసగుసలు వినిపించాయి. వాహనంలో ఉన్న వ్యక్తులు పండ్లను విక్రయించి డబ్బు తీసుకొస్తున్నట్లు చెప్పినా, అదంతా ఒట్టిదే అని తేలిందని సమాచారం. నగదు బదిలీకి వెళ్లిన వ్యక్తుల్లో ఒకరిచ్చిన సమాచారం ఆధారంగానే పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఈ విషయాలపై ఎస్‌ఐ శ్రీనివాసులును వివరణ కోరగా సొమ్మును సోమవారం ఐటీ అధికారులకు అప్పజెప్పనున్నట్లు తెలిపారు. మొత్తం సొమ్ము ఇద్దరిదని చెప్పారు. ఎలాంటి కేసు నమోదు చేయలేదని, ప్రాథమిక విచారణ అనంతరం పట్టుబడిన వారిని పంపించామన్నారు. పోలీసులకు ఎలా సమాచారం అందిందనే విషయంపై మాత్రం ఎస్‌ఐ సమాధానం దాటవేశారు. సాయంత్రం 5 గంటలకు పట్టుబడితే అర్ధరాత్రి వరకూ ఎందుకు గోప్యంగా ఉంచారన్న ప్రశ్నకూ ఏ ఒక్క పోలీసు అధికారి కూడా స్పందించకపోవడం గమనార్హం.

పాముకాటుతో వృద్ధురాలి మృతి


మృతురాలి సింతమ్మ (ఫైల్)

ముదిగుబ్బ: పాము కాటుతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మర్తాడులో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన సింతమ్మ (70) శనివారం వైఎస్సార్ జిల్లా అంబకపల్లి సమీపంలోని ఓ తోటలో మిరప కాయలు తొలగించే పనికి వెళ్లింది. ఈ క్రమంలోనే పాము కాటుకు గురైంది. తోటి కూలీలు ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందింది. మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త నారాయణ గతంలోనే మృతి చెందారు.

కారు ఢీకొని వ్యక్తి మృత్యువాత

గోరంట్ల: కారు ఢీకొని వ్యక్తి మృత్యువాత పడిన ఘటన మండల పరిధిలోని బుడ్డపల్లి సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. సీఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు... పాలసముద్రం గ్రామానికి చెందిన హనుమంతప్ప (41) మండలంలోని బుడ్డపల్లిలో శుక్రవారం రాత్రి డ్రామా చూసేందుకు వెళ్లాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం ద్విచక్రవాహనంలో పాలసముద్రం బయలుదేరాడు. బుడ్డపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బెంగళూరు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు బైకును ఢీకొంది. తీవ్రగాయాలైన హనుమంతప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే వేగవంతం చేయండి

- లెప్రసీ విభాగం జాయింట్ డైరెక్టర్ నరసింగరావు


మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ నరసింగరావు

లేపాక్షి: కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే వేగవంతం చేయాలని లెప్రసీ విభాగం జాయింట్ డైరెక్టర్ నరసింగరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధికారులతో ఆయన సమీక్షించారు. ఈనెల 16 వరకూ సర్వే నిర్వహించాలన్నారు. స్పర్శలేని మచ్చలు, చెవులు, వీపుపై నొప్పిలేని బుడిపెలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. పురుష వలంటీర్‌తో పాటు ఆశావర్కర్‌తో సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కేసులు గుర్తించి డాక్టర్‌కు నివేదించిన అనంతరం రోగులకు మందులు అందించాలని సూచించారు. సర్వే సిబ్బందితో ప్రజలు మొహమాటం పడకుండా, అనుమానాలు నివృత్తి చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి ఎస్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మంజువాణి, స్థానిక డాక్టర్ వెంకటచిరంజీవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ ప్రారంభం

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ (త్రీడే మ్యాచ్) అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ప్రారంభమైంది. అనంతపురం, చిత్తూరు జట్ల మ్యాచ్‌లో టాస్ గెలిచి చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 43.3 ఓవర్లకు 183 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 38 ఓవర్లలో 177 పరుగులకు నాలుగు వికెట్లు నష్టపోయింది.

రేపటి నుంచి టెక్నికల్ ట్రైనింగ్ కోర్సు పరీక్షలు

ప్రశాంతి నిలయం: కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి 6వ తేదీ వరకూ టెక్నికల్ ట్రైనింగ్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. www.bse.ap. gov.inలో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన ఇంద్రావతి సువీర హనుమాన్ ప్రకాష్


తీవ్రంగా గాయపడిన గంగలక్ష్మి

బత్తలపల్లి: మండల పరిధిలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... శనివారం ఉదయం అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు ద్విచక్రవాహనంలో వస్తున్న అనంతపురం పట్టణానికి చెందిన ఇంద్రావతి సువీర హనుమాన్ ప్రకాష్ మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొని రోడ్డుపై పడ్డాడు. అటుగా వస్తున్న కొందరు ఆటోలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

- ధర్మవరం పట్టణం రాజేంద్రనగర్‌కు చెందిన గంగలక్ష్మి తన కుమారుడు వెంకటేష్‌తో కలిసి మండలంలోని డి.చెర్లోపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి రాత్రి ధర్మవరం వెళుతుండగా బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద అదుపుతప్పి కింద పడిపోయారు. ప్రమాదంలో గంగలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. వారు ఇరువురికి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం జిల్లా కేంద్రానికి తరలించారు. ఇరువురి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బత్తలపల్లి పోలీసులు కేసులు నమోదు చేశారు.

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- 8న ముఖ్యమంత్రి పర్యటన
- కళ్యాణదుర్గం నుంచి బీమా నిధుల విడుదల
- పర్యటన విజయవంతం చేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, అనంతపురం కలెక్టర్ గౌతమి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు తదితరులు

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల పక్షపాతి అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ అన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేసి అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తున్నారని అన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఈ నెల 8వ తేదీన సీఎం కళ్యాణదుర్గానికి వస్తున్నారు. అధికారులు ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టర్ గౌతమి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, సీఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలిసి మంత్రి కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో సీఎం పర్యటనపై సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఖరీఫ్-2022కు సంబంధించి వాతావరణ బీమా, ఫసల్ బీమా కింద రాష్ట్రంలోని రైతులను ఆదుకునేందుకు రూ.1,016 కోట్లు విడుదల చేసేందుకు సీఎం కళ్యాణదుర్గం వస్తున్నారన్నారు. ఇందులో జిల్లాకు రూ.211.80 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఇంతటి మేలు చేకూరే బృహత్తర కార్యక్రమానికి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయంతం చేయాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి..

సీఎం పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. ఏర్పాట్లలో పొరపాట్లకు తావివ్వకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు. సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ అప్పగించిన పనులను బాధ్యతగా పూర్తి చేయాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సభా స్థలి, హెలిప్యాడ్, ట్రాఫిక్, పార్కింగ్ ప్రదేశాలు వంటి వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తామన్నారు. సమీక్షలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళ్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, కళ్యాణదుర్గం డివిజన్‌లోని తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

సీఎం పర్యటన సందర్భంగా బహిరంగ సభ కోసం కళ్యాణదుర్గంలోని ఏపీ మోడల్ స్కూల్ ఎదురుగానున్న ఖాళీ స్థలాన్ని మంత్రి, కలెక్టర్, ఎస్పీ, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ పరిశీలించారు. సభకు వచ్చే వాహనాలు నలువైపులా సమీప ప్రాంతంలో పార్కింగ్ ఉండేలా ప్రధాన రహదారుల పక్కనే ఖాళీ స్థలాలను అన్వేషించారు. అనంతరం పట్టణంలో హెలిప్యాడ్ కోసం పలు ప్రదేశాలు పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సీఎం కాన్వాయి రోడ్డు మార్గాన వెళ్లేందుకు వీలుగా పలు రూట్లను పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, ఎంపీపీ మారుతమ్మ, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు అర్చన, ఆంజనేయులు, పెరుగు తిమ్మరాజు, గంగాధర్, రాము, చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర సృజనాత్మక డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, సీనియర్ నాయకులు సుధీర్, తిరుమల వెంకటేశులు, కృష్ణారెడ్డి, రాంభీమప్ప, సోమనాథ్‌రెడ్డి, అఫ్జల్, జెడ్పీటీసీ మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.